
భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథల పోటీలో
తృతీయ బహుమతి పొందిన కథ




# ప్రామిస్

డా॥ కెజి వేణు

"చంద్రా! ఒక్కసారి ఇలారా...."

బయటికి వెళ్లబోతున్న కొడుకుని వెనక్కి పిలిచాడు రామచంద్రరావు... వంటగదిలో నుంచి భార్య సుశీలమ్మ కూడా వచ్చింది.

"వారం రోజుల క్రిందటే నీ బర్తడేకి బట్టలు కొనుక్కోమని వెయ్యిరూపాయలిచ్చాను. ఇంకా కొనుక్కోలేదేం"

తండ్రి ప్రశ్నకు సమాధానంగా "ఆ డబ్బు నాకు చాలదు... మరో రెండు వేలు కావాలి" అన్నాడు చంద్రం.....

కొడుకు మాటకు ఆశ్చర్యపోయారిద్దరు. సొంతంగా ఒక్కడే వెళ్ళి బట్టలు కొనుక్కోవటం మొదలు పెట్టాక ఇచ్చిన డబ్బుతో తనకు నచ్చిన బట్టలు తెచ్చుకోవటమే కాని ఏ రోజూ కూడా 'ఇచ్చిన డబ్బు చాలదు. మరికొంత ఇవ్వండి' అని అడగలేదు. ముందే ముక్కోపి. రామచంద్రరావుకు కోపం వచ్చింది.

"ఎందుకురా అంత డబ్బు. బట్టలకేనా?"

కాదునాకు వేరే అవసరంవుంది"

"ఏం అవసరం" పైకి లేచాడు రామచంద్రరావు

'అవసరమని చెప్పానుకదా!' చిరాకు పడ్డాడు చంద్రం.

తండ్రి కొడుకుల మధ్య వాదన పెరగటం ఇష్టంలేని సుశీలమ్మ. చాలా మెల్లగా. ప్రేమగా...

"డాడీ... తరువాత ఇస్తార్లే ... నువ్ ముందు వెళ్ళి బట్టలు కొనుక్కోనాన్నా" అంది, తల నిమురుతూ....

"కాదు నాకిపుడే కావాలి" ముఖం చిట్లించాడు.

రామచంద్రరావుకు కోపం తాచుపాములా లేచింది....

వెంటనే సుశీలమ్మ సైగలతోనే బ్రతిమాలి శాంతపరచింది....

వెంటనే లోపలికి వెళ్ళి రెండు వేలు తెచ్చి చంద్రం చేతిలో పెట్టింది.

డబ్బు అందుకొన్న వెంటనే వదిలిన బాణంలా రయ్‌మని బయటికి వెళ్ళిపోయాడు చంద్రం.

వెళ్ళిపోతున్న కొడుకు వైపు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారిద్దరూ. ఎందుకో కొద్దిరోజులుగా కొడుకు పట్ల భయాలు పెంచుకొంటోంది సుశీలమ్మ. భర్తకు దగ్గరిగా జరిగి సోఫా మీద కూర్చుంటూ...

"ఇంటర్మీడియట్ దాకా చక్కగా కాలేజి నుంచి రాగానే 'అమ్మా' అంటు వెంటపడి ఎన్నో కబుర్లు చెప్పేవాడు. టెన్త్ క్లాసు దాకా అయితే రాత్రిపూట అన్నం కలిపి తినిపిస్తేకాని తినేవాడుకాదు. ఇపుడు అసలు వాడు సరిగ్గా నాతో మాట్లాడటమేలేదంటి.. ఇంట్లో ఉన్నంతసేపూ తలుపులు వేసుకొని వాడిగదిలో ఉండిపోతున్నాడు.. భోజనానికి పిలిస్తే గంటసేపటికి కాని బయటికి రావటంలేదు. వచ్చినా 'ఆ-ఊ' మాటలు తప్ప.... మరేమీ మాట్లాడటంలేదు"

"అవును నేనూ గమనిస్తూనే ఉన్నాను" అన్నాడు రామచంద్రరావు

"అంతేకాదండి... మీరు క్యాంపు కెళ్ళినపుడు 'రికార్డు వ్రాసుకోవటానికి వెళ్తున్నానంటూ' రెండు రాత్రుళ్ళు వరుసగా స్నేహితుల దగ్గరే గడిపి వచ్చాడు... పిల్లలు ఎపుడు ఎలా మారిపోతారో తెలియటం లేదు... గట్టిగా మందలిస్తే ... ఏ అఘాయిత్యం చేసుకొంటారేమోనని భయంగా వుంది... అటు ప్రపంచం కూడా చాలా క్రూరంగా, భయంకరంగా మారిపోతూవుంది....చంద్రాన్ని గొప్ప ఇంజనీర్ని చేయాలన్న మన ఆశల్ని వాడు నాశనం చేయడుకదండి" బేలగా చూస్తూ భర్త గుండెలమీద వాలిపోయింది సుశీలమ్మ... ఆమె కన్నీళ్ల తడి తన ఎదకు తగిలేసరికి రామచంద్రరావు కళ్ళలో నీల్లురాలాయి.

"ఇంతకీ వాడికి అంత డబ్బుతో ఏ అవసరమొచ్చిందో"

భర్తమాటలకు తలెత్తి "ఏమోనండి... ఏ అలవాట్లు కొత్తగా నేర్చుకున్నాడో ఏమో ఒక్కసారి వండిన అన్నం చెడిపోతే.. మరి తినటానికి అది పనికి రాదండి... నాకేదో భయంగా వుందండి ..." కన్నీళ్లు పెట్టుకుంది సుశీలమ్మ...

భార్యకన్నీళ్లు తుడుస్తూ "ఎందుకు అనవసరంగా అంతగా వూహించుకుంటావ్" అన్నాడు.

"ఊహ కాదండి. వసుంధర కొడుకు సుమంత్ చెన్నైలో ఐఐటిలో చేరేవరకు మచ్చలేని కుర్రాడిలా ఉండేవాడు.. ఏంజరిగిందో ఏమో అక్కడ బాగుచేయడానికి వీలులేనంతగా చెడిపోయాడు డ్రగ్స్ విపరీతంగా వాడి.. ఆరోగ్యం పూర్తిగా పాడైపోయి. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్నాడు. మాకొలీగ్ ప్రకాశ రావుగారబ్బాయి నవీన్ అంతులేని జల్సాలకు అలవాటుపడిపోయి ఖర్చులకు డబ్బు దొరక్కా... ఈ మధ్య దొంగతనాలు కూడాచేస్తున్నాడట"

"ఎవరో చెడిపోయారని మనవాడు కూడా అదే దారి పడతాడని ఎందుకు నువ్వనుకొంటున్నావ్"

"మీరెంత నామనసును శాంతపరచినా.. ఏదో శంక నన్ను పీడిస్తోందండి" బేలగా చూసింది సుశీలమ్మ...

ఇంతలో చంద్రం వచ్చాడు... చాలా వుషారుగా ఉన్నాడు. వచ్చీరాగానే అమ్మా, నాన్నల ఎదురుగా నిలబడి... ధీమాగా తల ఎత్తి "మీరిచ్చిన డబ్బుతో..నాకు నచ్చినపని నేనే చేస్తున్నాను" అంటూ విషయమంతా చెప్పాడు..చెప్పి తన గదిలోకి వెళ్ళిపోతూ "దయచేసి నా ఆనందానికి అడ్డురాకండి" అంటూ తలుపు దభేలుమని మూసుకొన్నాడు.

అంతావిని. శిల్పాల్లా ఉండిపోయారిద్దరు.చాలాసేపు చూపులు తప్ప ఇద్దరి మధ్య మాటలు కరువైపోయాయి. ఇంట్లో వాతావరణం ఒక్కసారిగా గంభీరంగా మారిపోయింది.

కాసేపటికి తేరుకొన్న రామచంద్రరావు "వీడికి ఈ ఆలోచన ఎలా వచ్చింది" భార్య కళ్లల్లోకి చూశాడు.

కళ్ళల్లో తడిని తుడుచుకుంటూ "ఏమోనండి. ఎవరు నేర్పించారో  ఏమో వీడికి ఈ ఆలోచన" అంది.

ఎపుడూ ఆలస్యంగా లేచే చంద్రం తన పుట్టిన రోజున తెల్లారగానే లేచాడు.. "ఒరేయ్ అందరూ అనుకొన్న టైంకి అక్కడికి రావాలి. రోజంతా మనం అక్కడే ఎంజాయ్ చేయాలి. లేట్ చేయకండి" అంటూ స్నేహితులదరికి ఫోన్లు చేశాడు. గబగబ తయారైపోయి బయటికి వెళ్లిపోయాడు.

మధ్యాహ్నం పదకొండు గంటల సమయంలో రామచంద్రరావు ఒక నిర్ణయానికి వచ్చాడు.'సుశీలా బయలుదేరు" అన్నాడు. అర్ధంకాక "ఎక్కడికండి" అడిగింది. "ముందునువ్ బయలుదేరు. అన్నీ చెపుతాను" అంటూ ఆటో పిలిచి అందులో ఎక్కించి గాంధీనగర్ సెంటర్‌కి వెళ్లమన్నాడు.

ఆటో దిగిన తరువాత "ఎక్కడికండి" మళ్ళీ అడిగింది సుశీలమ్మ "రా చెబుతాను" అంటూ కుడివైపునున్న తెల్లటి బిల్డింగ్ దగ్గరికి తీసికెళ్ళాడు. ఆ భవనం గేటు మీద ఎత్తులో పెద్ద బోర్డు కనిపించింది. అందులోవి అక్షరాలను పట్టి.. పట్టి చదివింది. ఒక్కసారిగా కళ్ళు చెమ్మగిల్లాయి 'నాకు నచ్చిన పని నేను చేస్తున్నాను' అని రెండు రోజుల క్రితం  తన కొడుకు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. ఆ రోజు ఇద్దరి ఎదుట నిలబడి..

"నా పుట్టిన రోజుకు నేను క్రొత్త బట్టలు కొనుక్కోవటం లేదు. స్నేహితులకోసం పార్టీలు ఇవ్వటంలేదు. మీరిచ్చిన మొత్తం డబ్బుతో వృద్ధాశ్రమంలో ఒకరోజు మూడు పూటలా అందరికి విందు భోజనం పెట్టాలనుకొంటున్నాను.నాపుట్టిన రోజున నా ఆనందం నాకు ముఖ్యం. ఇదిగో డబ్బుకూడా కట్టి వచ్చాను. నా నిర్ణయానికి మాత్రం అడ్డు చెప్పకండి" అంటూ రసీదు చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

జరిగిన సంఘటన గుర్తుకొచ్చి ఇద్దరి కళ్లల్లో పుత్రోత్సాహం అమృతంలా కురిసింది.వృద్ధాశ్రమం గేటు తీసుకొని మెల్లగా పైకి వెళ్లి కిటికీ ప్రక్కన ఇద్దరూ నిలబడ్డారు. వృద్ధులంతా ఆనందంగా నవ్వుకొంటున్నారు... పిల్లలతో ఆడుకొంటున్నారు.

"ఒరేయ్ మనలో ఎవరి బర్త్‌డే అయినా సరే ఇలాగే ఇక్కడే జరుపుకోవాలి" అన్నాడు స్నేహితుల మధ్య నిలబడి చంద్రం. ఓ.కే కోరస్‌గా పలికారు ప్రామిస్ అంటూ అందరూ చేతులుకలిపారు.

సాధించిన విజయానికి సూచనగా నాలుగువ్రేళ్లు మడిచి బొటనవేలు పైకెత్తి చూపుతూ భార్య కళ్ళల్లోకి గర్వంగా చూశాడు రామచంద్రరావు.

కవిత

# ఓ పురుష్ ! xy ?

## ఛాయారాజ్

విస్ఫోటించి ప్రవహించి
విద్యుద్ఘాతాలతో వికసించి రూపొందిందామె
భరించమనలేదు నిన్ను ధరించమనలేదు
ఊసులేదు నీతో పేచీలేదు
నువ్వున్నావోలేవో! ఆ నిర్మాణంతో నీకు వైరుధ్యమేమైనా వుందా?
అందాన్ని అభినయించిందేగాని, నిన్నాస్వాదించమనలేదు
ధ్యానించలేదు! ఎందుకూ భావించలేదు
ధ్వనించిందేగాని, ఏమి వింతగా వినిపించలేదామె
అందుకే ఆ అందానికే నువ్వెలా చెందుతావు?
నీ ధ్యాసను చూసి నీఆశను చూసి ప్రకంపించిందామె
రక్తమాంసాలలో దాక్కొని, అవయవాలను ధరించిందామె
అంతమాత్రానికే ఆమెకు నువ్వేమవుతావు?
శతకోటి ఘనపుటడుగుల బరువున్న సౌందర్యం
నీ స్వంతమెలా అవుతుంది?
ఆ రక్తరాగాలలో నీ ఉదయమెంత సాయింత్రమెంత!
ఇరుకు హృదయంలో నీ అనుబంధం సరుకెంత?
నీ ఇష్టం ఆదాయమెంత? నీ సౌష్టవం అప్పెంత?
అమృతాభినవ అపురూపమే ఆమంటే
ఆమెను ఆకర్షించే మగెంత?వికర్షించే మోహమెంత మృతుడా?
మనల్ని మించిన మరో గొప్ప నిర్మాణాన్ని ధ్వంసం చేయగలమా?
భరించమనలేదు మనల్ని ధరించమనలేదామే ధరణి
ఆమె అదిశ సదిశాకృతాకృతానందంలో మన ఆచూకీయేలేదు
ప్రస్పందనల ప్రేమ బిందువు వద్దనుండి ప్రపంచంతో ఆడుకోగలమా
ఆశవద్ద అనురాగం దొరకదు మైకమా
స్వంతమనుకున్న సమయంలోనే పరాయివాళ్ళం మనం
ప్రేమలూ పాలశిల్పాలూ మన ఆస్తులుకావు మగా
ప్రవాహాలు కౌగిళ్ళలో ఇంధింపబడవు సుమా!
అదితీ! నిన్ను గెలిచిన ఇంద్రుడిని నువ్వే ఓడించావు పర్జన్యయుద్ధంలో
ఊర్వశీ! ఓడిన పురూరవుడిని క్షమించేవు ప్రేమయుద్ధంలో
సంధ్యా! వింధ్యా! హిమాచలా! అరణ్యమా! సాగరమా!
నువ్వెలా అస్తమిస్తావమ్మా? సెక్సు ఆకళ్ళలో!
××! ఎవరెవదు ఎందుకు హింసించినా క్షమించకు
పురుష్! దేన్ని ధ్వసించ బూనుకున్నావు? xy !
సెక్సుయుద్ధాలను తెచ్చిపెడుతున్నారు గమనించుకోండి.
'ప్రేమ'లను రెచ్చగొడుతున్నారు సుమా గుర్తుంచుకోండి.
(xx = ఆడ, xy = మగ - జన్యుపరంగా)